

**ఉగాది పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

# అనుబంధం

- స్వర్ణ ప్రభాతలక్ష్మి

"మమ్మీ! మినప సున్ని ఉండలు బావుంటాయి కదూ! మనింట్లో అవెప్పుడూ చేయించలేదేం. ఈసారి నా బర్త్‌డేకి అవే చేయించు మమ్మీ!" ప్లేట్లో సాండ్‌విచ్ మునివేళ్ళతో అటూ ఇటూ కదుపుతూ అంది నందిని.

"ఏమిట్రా నందూ! నీకు మినప సున్నిమీద మనసు పోయింది? ఎక్కడ తిన్నావ్?" నవ్వుతూ అడిగాడు మనోహర్.

"నీ కూతురు కొత్త రుచులు మరుగుతోంది మనూ! మొన్న అరిసెలు, పూర్ణం బూరెలు బావుంటాయని స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇంత హై కాలరీలు, ఫాట్ ఉన్న ఫుడ్ తింటే ఎందుకూ పనికిరావు." సాధింపుగా అన్నది 'బ్యూటీ క్లినిక్' నడుపుతున్న సంధ్య.

'ఈ పాత తరం వంటలు మేమే మర్చిపోయాం. నీకెక్కడ దొరుకుతున్నాయి? మీ మమ్మీ అన్నట్టు అనవసరంగా ఒంట్లో కొవ్వు చేరితే అందం, నేవళం తగ్గటమేకాక గుండెకు కూడా మంచిది కాదు. మనం తినేది మనకి శక్తిని, బలాన్ని ఇచ్చేదిగా ఉండాలి గాని ఆరోగ్యం పాడుచెయ్యకూడదు కదా!" అనునయంగా అన్నాడు కార్డియాలజిస్ట్ మురళీ మనోహర్.

"మా ఫ్రెండ్స్ అందరూ తింటుంటారు. ఎప్పుడైనా తింటే ఏమవుతుంది?" సన్నగా గొణిగింది నందిని.

"ఇంకేమౌతుంది? ఇలాంటి అడ్డమైన చెత్తా తింటే రోడ్డు రోలర్ లాగా తయారవుతావు. ఎన్ని రకాల సలాడ్స్ లేవూ! ఏ రకం కావాలన్నా మన అనసూయ చేస్తుంది. చేయించుకో! నిన్ను, మిస్ యూనివర్స్‌గానో, పోనీ మిస్ ఇండియాగానో కనీసం మంచి మోడల్‌గా అయినా చూడాలని నేను ఆశపడుతుంటే నీకు అన్నీ ఇలాంటి కోరికలేమిటీ?" విసుక్కుంది సంధ్య.

"అవునమ్మా! నందూ! నా వారసురాలిగా నువ్వు పెద్ద డాక్టరువి కావాలి. లేకపోతే మీ అమ్మ ముచ్చటయినా తీర్చాలి. అందుకు ఫౌండేషన్ ఇప్పటినుంచే వేసుకోవాలి." బ్రేక్‌ఫాస్ట్ ముగించి లేస్తూ అన్నాడు మనోహర్. నందిని తల దించుకుని మాట్లాడకుండా కూర్చుంది.

★ ★ ★

కాలేజి నుండి వచ్చి లోపలికి రాబోయిన నందినికి లోపల తల్లిదండ్రులు ఏదో విషయం మీద వాదించుకోవడం వినిపించింది. కాని విషయం ఏమిటో అర్థం కాలేదు. "అక్కడికి వెళ్ళవలసిన అవసరం నాకేం కనిపించడం లేదంటే 'ఒక్కసారి వెళ్ళండీ!' అంటావేమిటి? నీకెన్నిసార్లు చెప్పాను. ఆ ఊరితో నాకు సంబంధం లేదనీ!" కోపంగా వినిపిస్తోంది మనోహర్ గొంతు.

"సంబంధం ఎందుకు లేదూ? అక్కడి పొలాలకిప్పుడు మంచి ధర పలుకుతోందిట. అదేదో పూర్తిచేసుకువస్తే మీకు నష్టమేంటి? రావాల్సింది పోగొట్టుకోవడం తెలివితక్కువ కదా?" గొణుగుతోంది సంధ్య.

"ఇప్పుడు నీకు డబ్బుకి ఏం కరువొచ్చింది? ఎంత కావాలో చెప్పు. నేనిస్తాను. ఇప్పుడు నేను అక్కడికి వెళ్తే తెంచుకున్న బంధం పెంచుకోవాల్సి వస్తుంది. అది నాకు ఇష్టంలేదని నీకు తెలుసుగా? ఈ సంగతి నా దగ్గర అనవద్దంటే నీకెందుకు అర్థంకాదూ? నీకు... " నందినిని చూసి మాటలు ఆపేశాడు మనోహర్.

"డాడీ! ఎక్కడికి వెళ్ళనంటున్నారు?" తండ్రి పక్కనే కూర్చుంటూ అడిగింది నందిని.

"ఇవాళ ఇంత లేట్ అయిందేం నందూ?" కూతురి ప్రశ్న విననట్టే అడిగింది సంధ్య.

"ఇవాళ కాలేజీలో మీటింగ్‌లో సునామీ బాధితులకు బట్టలు కలెక్ట్ చెయ్యాలని చెప్పారు. ఎవరు ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకునేసరికి లేట్ అయింది. ఎక్కడికి డాడీ! అమ్మ వెళ్ళమంటోంది? మళ్ళీ అడిగింది నందిని.

'పెద్దవాళ్ళ మాటల్లో జోక్యం చేసుకోకు. ఇప్పుడు నువ్వు ఎండలో తిరిగి పాత బట్టలు సేకరించకపోతే కొంపలు మునగవ్. కాలేజి అవగానే మా జిమ్‌కి వచ్చి కాస్త ఎక్సర్‌సైజ్ చెయ్యి రోజూ!" కసిరింది సంధ్య.

"నందూ! నీకెందుకు రా, ఈ అనవసరపు ఆయాసం? కాలేజి అవగానే ఇంటికొచ్చేసి చక్కగా చదువుకో! నీకెక్కడ కావాలంటే అక్కడ కోచింగ్ తీసుకో! ఇంటర్మీడియెట్ నీ లైఫ్‌కి టర్నింగ్ పాయింట్ రా! టైం వేస్ట్ చెయ్యకుండా బాగా చదివితే గాని ఈ పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడం కష్టం." నచ్చచెప్తున్నట్టు అన్నాడు.

నందిని మౌనంగా వింటూ ఉండిపోయింది.

★ ★ ★

రాత్రి భోజనాలయిన తరువాత నందిని టి.విలో కార్టూన్ షో చూస్తోంది. మనోహర్ వచ్చి సోఫాలో పక్కనే కూర్చుంటూ, రిమోట్ తీసుకుని న్యూస్ ఛానల్‌కి మార్చి, "ఇంకా చిన్న పిల్లలాగా ఈ కార్టూన్ షోలేంటమ్మా? ఇవాళ రేపు మన చుట్టూ ఏం జరుగుతోందో తెలుసుకోకపోతే వెనకబడి పోతాం. అన్నట్టు నందూ! నీ పుట్టిన రోజు దగ్గరికొచ్చిందిగా! ఏం ప్లాన్ చేస్తున్నావ్?" అన్నాడు.

జుట్టుకు పెట్టిన పిన్నులన్నీ తీసేసి, జుట్టు భుజాల మీదికి స్వేచ్ఛగా వదిలేస్తూ అక్కడికి వచ్చింది సంధ్య. "చిన్న పిల్ల. అదేం ప్లాన్ చేస్తుంది. మనూ? వచ్చే సంవత్సరం దాని పుట్టినరోజు ఏ హాస్టల్‌లోనో జరగాల్సిందే కదా! అందుకే ఈఏడు దాని బర్త్‌డే గ్రాండ్‌గా చేద్దాం" అంది. "ఔనౌను. మనం 'గెట్ టుగెదర్' ఎరేంజ్ చేసి చాలారోజులైంది కదా! మనింట్లో 'గెట్ టుగెదర్' సరదాగా ఉంటుందని డాక్టరు మాధురి కూడా అంది. మరి ఏం చెయ్యబోతున్నావ్?" భార్యని అడిగాడు కుతూహలంగా.

"మనూ! ఈసారి కాంటినెంటల్ డిషెస్ కూడా పెట్టాలి. నందూ! మన క్లినిక్‌కి సినిమా హీరోయిన్స్‌కి డ్రెస్సెస్ డిజైన్ చేసే డ్రెస్ డిజైనర్ వచ్చింది. ఆమె నా క్లయింట్ లే! నీకె లాంటి డ్రెస్ కావాలో చెప్పు. చేయిస్తాను. అందరిలో నువ్వు ప్రత్యేకంగా వెలిగిపోవాలి." సంధ్య ఉత్సాహంగా అంది.

"నందినీ! మమ్మీ అడుగుతుంటే నువ్వు ఏం మాట్లాడవేం?"

"డాడీ! ఈసారి నా పుట్టినరోజు ఏ హడావిడి లేకుండా సింపుల్‌గా..."

నందిని మాట పూర్తికాక మునుపే ఖస్సుమని లేచింది సంధ్య. "విన్నావా, మనూ! దీని మాటలు? మదర్ థెరిసా వారసురాలిననుకుంటోంది. అసలు దాన్ని కాదు. నిన్ను అనాలి. ఆ కాలేజీలో చేర్పించద్దు అంటే అది అడిగిందని చేర్చావు. అన్నీ ముసలమ్మ వేషాలే! భగవద్గీత అంటుంది. వివేకానంద అంటుంది. చూస్తూ ఉండు, చివరికి దీన్ని ఒక సన్యాసినిని చేసి కూర్చోబెడతారు వాళ్ళు" అంది అక్కసుగా.

"నందీ! ఈ వయసులో కాకపోతే సరదాలు మరెప్పుడమ్మా? మేం సంపాదించేదంతా నీకోసమేగా? నువ్వు మన హోదాకి తగ్గట్టుగా ఉండాలి" నచ్చచెప్పాలని ప్రయత్నించాడు.

"ఆ! ఉంటుంది. తన తోటిపిల్లలు ఎలా ఉన్నారు. తనెలా ఉంది? ఊళ్ళోకంతా పెద్ద పేరున్న బ్యూటీ క్లినిక్ నడుపుతున్నాను. ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి తమ అందాలకు మెరుగులు దిద్దించుకుంటారు. ఇదేమో అటుకేసే తొంగి చూడదు. ఎన్నాళ్ళనుంచి చెప్తున్నానూ మా క్లినిక్‌కి మంచి డెంటిస్ట్ వస్తుంది, ఎడంగా ఉన్న ఆ పళ్ళకి కాస్మెటిక్ సర్జరీ చేయిస్తానని? నవ్వుతుంటే పళ్ళు, మొహం జిగేలుమనాలి. అసలు పట్టించుకుందేమో చూడు నీ కూతురు" చిటపట లాడింది.

సంభాషణ పక్కదారి పట్టిందని గ్రహించిన మనోహర్, "సంధ్యా నువ్వు కాసేపు ఊరుకో! దాని ఆలోచనేంటో చెప్పనియ్యి" అంటూ నందినికేసి తిరిగి..

"ఏమ్మా! ఎలా సెలబ్రేట్ చేద్దామనీ?" అనునయంగా అడిగాడు.

"డాడీ! మన ఇంటి దగ్గరున్న అనాథాశ్రమంలోను, ఓల్డేజ్ హోంలోనూ అందరికి బట్టలు, బ్లాంకెట్స్, పళ్ళు పంచాలనుంది" నందిని నెమ్మదిగా అంది.

"చూశారా! మనం దీన్ని అందలంమీద కూర్చోపెట్టాలనుకుంటే దీని బుద్ధి బురదగుంటలోకే లాగుతోంది. ఎంతసేపూ అలగా స్నేహాలు, అలవాట్లు" సంధ్య చీదరింపుగా పట్టించుకోకుండా.

"సరే! నందూ! నీకిష్టమైనట్టే చెయ్యి" అన్నాడు.

"థాంక్యూ డాడీ!"అంటూ నందిని లేచి వెళ్ళిపోయింది.

"చూశారా, మన మాటంటే ఇప్పుడే దీనికి లెక్కలేదు. నీ గారాబమే దాన్ని ఇలా తయారుచేసింది." సంధ్య కోపగించుకుంది.

సంధ్యా! నువ్వు కోపం కాస్త తగ్గించుకోవాలి. అది పసిపిల్ల కాదు. దాని ఇష్టాయిష్టాలకు కూడా మనం కాస్త విలువ ఇవ్వాలి. మనకి నచ్చని విషయాలు నచ్చచెప్పి ఒప్పించాలి. దాన్ని నువ్వు ఓర్పుగా డీల్ చెయ్యాలి" అన్నాడు.

మనోహర్ హితబోధ విని రుసరుస లాడుతూ లేచి వెళ్ళిపోయింది సంధ్య.

★ ★ ★

నందిని పుట్టిన రోజు తను కోరుకున్నట్టుగానే జరిగింది. పది రోజుల తరువాత రాత్రి పడుకోబోయే ముందు

**పరిచయం**



మనసుకు నచ్చే రచనలు (అందరివి) మళ్లీ మళ్లీ చదవడం..మధురంగా అనిపించే సంగీతాన్ని ఆస్వాదించడం అలవాటుగా మారిన నేను వృత్తిరీత్యా ఆంగ్ల ఉపాధ్యాయినిని. మా నాన్నగారు పురాణం బాలగంగాధర తిలక్ ద్వారా నాకు చిన్నప్పుడే కథలపై ఆసక్తి కలిగింది. 'నువ్వు రాయలేవులే..' అని రెచ్చగొట్టి ప్రోత్సహించే మా శ్రీవారు దీక్షితులు కొండంత అండతో అప్పుడప్పుడు పత్రికల్లో చిన్న కవితలు, కథలు, వ్యాసాలు రాశాను. రాస్తూనే వున్నాను. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి కథలు, వ్యాసాలు నాటిక ప్రసారమయ్యాయి. నేను రాసిన కథకి బహుమతి రావడం ఇదే ప్రథమం. పేరు ప్రతిష్ఠతలున్న రచయితలనే కాక నాలాంటి సామాన్యులను కూడా ప్రోత్సహిస్తారని మరోసారి నిరూపించిన 'ఆంధ్రభూమి'కి నా కృతజ్ఞతాభివందనాలు.

స్వర్ణ ప్రభాతలక్ష్మి
8-3-168/20/16, సిద్ధార్థ నగర్ (నార్త్),
హైదరాబాద్

నందిని తల్లితండ్రుల పడక గదిలోకి వచ్చింది.

"ఏం కావాలి?" దిండ్లు సర్దుకుంటూ అడిగింది సంధ్య. ఆమె ఈ పది రోజులుగా కూతురితో ముభావంగా ఉంటోంది.

"రా! నందూ! అక్కడే నిలబడ్డావేం?" చదువుతున్న పుస్తకం పక్కన పెడ్తూ కూతుర్ని పిలిచాడు మనోహర్.

ఆమె సంకోచంగా వచ్చి కూర్చుంది. ఏదో చెప్పడానికి వచ్చిందని గ్రహించి.

"ఏమ్మా! ఏమన్నా కావాలా?" లాలనగా అడిగాడు.

డాడీ! ఓల్డేజ్ హోంలో ఇన్‌మేట్స్ చాలా మందికి అప్పుడప్పుడయినా ఎవరో విజిటర్స్ వస్తుంటారు. పండగలకి, వాటికి ఇళ్ళకి కూడా తీసుకెళ్తుంటారుట. అసలు ఎవరూ రాని వాళ్ళు. లేని వాళ్ళు అక్కడ అయిదారుగురు ఉన్నారు. అందుకని మమ్మల్ని వాళ్ళల్లో తలా ఒకరిని వచ్చే ఉగాదికి గెస్ట్‌ల్లాగా ఇంటికి తీసుకెళ్ళమన్నారు మా మేడమ్. తరువాత సెమినార్‌లో వాళ్ళతో మా అనుభవాల గురించి మాట్లాడాలిట". సంకోచిస్తూ అంది.

కాసేపు ఏం మాట్లాడకుండా కూతురి మొహంలోకి ఆలోచిస్తూ చూస్తూ ఉండిపోయాడు మనోహర్.

'వాళ్ళ దగ్గరికెళ్ళి సాయం చేస్తున్నావు చాలదా? ఇంక ఆ తద్దినాల్ని ఇంటికి కూడా తేవాలా? అంత జాలి అనిపిస్తే అందర్నీ మీ మేడమ్‌నే తీసుకెళ్ళమను. ఇలాంటి వాటికి నేను ఒప్పుకోను' అంది సంధ్య.

తల్లి మాట వినిపించనట్టు, "ప్లీజ్ డాడీ! పండుగ రోజైనా పలకరించి, ఆదరిస్తే వాళ్ళకి ఎంత సంతోషం, సంతృప్తి కలుగుతుంది. ఆ మాత్రం చేయలేమా, డాడీ?" జాలిగా అడిగింది.

భర్త బలహీనత కూతురే అని తెలిసిన సంధ్య ఎక్కడ భర్త ఒప్పేసుకుంటాడోనని.

"ముక్కు, మొహం తెలీదు. వాళ్ళ అలవాట్లు తెలీదు. కొత్త వాళ్ళని అలా ఇంట్లోకి తెచ్చి పెట్టుకోకూడదు బేబీ!" అంది సంధ్య.

"ఔనమ్మా! తెచ్చినా ఎక్కడ ఉంచుతాం? వాళ్ళ ఆరోగ్యాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. అది అంత తేలిక కాదు. ఎందుకొచ్చిన బెడద?" మనోహర్ కూడా అయిష్టం వ్యక్తం చేశాడు.

"మన గెస్ట్ రూం ఖాళీనేగా! అంత ముసలివాళ్ళకి పెద్ద అవసరాలేం ఉంటాయి? ప్లీజ్! వాళ్ళని చూస్తే చాలా బాధగా అనిపిస్తోంది డాడీ! ఆమె గొంతు గద్గదికమైంది. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

కూతురి కన్నీరు చూసి ఇద్దరూ మెత్తబడ్డారు. అది గమనించిన నందిని.

"వెంకటేష్‌కి, రాములమ్మకి చెప్పి గది సర్దించవా?" ఆశగా అడిగింది.

"నేను సర్దిస్తాలే! మేం చెప్పింది వినడం పూర్తిగా మానేశావుగా!" గొణుక్కుంది సంధ్య.

"థాంక్స్, మమ్మీ!" తల్లి బుగ్గమీద చిన్న ముద్దుపెట్టి హుషారుగా బయటికి నడిచింది నందిని.

తరువాత భార్యాభర్తలు ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

★ ★ ★

ఉగాదికి ముందురోజు మధ్యాహ్నమే నందిని వృద్ధాశ్రమానికి బయల్దేరింది. సంధ్య, మనోహర్ ఇంట్లోనే ఉన్నారు. డ్రాయింగ్ రూంలో టి.వి. చూస్తున్న ఇద్దరికీ ఈ అనుభవం కొంచెం థ్రిల్లింగుగా ఎక్కువ చిరాగ్గా ఉంది.

కారు హారను వినిపించింది. రెండు నిముషాల తరువాత గుమ్మం దగ్గర అలికిడి. ఇద్దరూ తల తిప్పి చూశారు.

ఎండిపోయి, ఒరుగులా ఉన్న సన్నటి, తెల్లటి ముసలామెని నందిని జాగ్రత్తగా చేయి పట్టుకుని మెట్లు ఎక్కిస్తోంది.

మనోహర్, సంధ్య చటుక్కున నిలబడ్డారు. సంధ్య కంగారుగా భర్త వంక చూసింది. కాని అతని చూపులు గుమ్మం వేపే ఉన్నాయి. మనసు పొరల్లో ఏవో కదలికలు. గుండె మూల ఎక్కడో తడి. అతడు అప్రయత్నంగా "అమ్మా!" అన్నాడు.

ఆ పిలుపు విని ఆమె నెమ్మదిగా తలెత్తి అతని వంక చూసింది. గాజు గోళాల్లాంటి కళ్ళలో సన్నటి నీటి పొర.

"మురళీ!" అంది ఆమె ఒణుకుతున్న గొంతుతో.

చలించిపోయాడు మనోహర్. అదే పిలుపు. పందొమ్మిదేళ్ళ క్రితం అన్ని బంధాలు తెంచుకుని వస్తుంటే, ఆర్తి, వేదన, ప్రేమ, నిస్సహాయత మిళితమైన ఆక్రందన లాంటి పిలుపు.

ఆమె ఆవేదనతో, ఉద్వేగ్గతతో చిగురుటాకుల్లా ఒణికిపోతోంది. కళ్ళలో చోటులేని కన్నీరు ముడుతలు పడి ఎండిన ఆమె బుగ్గల మీదికి కారింది.

నందిని చెయ్యి ఆమె చుట్టూ బిగుసుకుంది.

జాగ్రత్తగా, అపురూపంగా ఆమెని పట్టుకుని సోఫా దగ్గరికి నడిపించి కూర్చోబెడుతూ.

"అవును డాడీ! బామ్మే! బాగానే గుర్తుపట్టారు. ఆమె నాతో మీ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. కాని ఆమె కబ్బోర్డులో మీ ఫోటో! రోజూ చదివే భగవద్గీతలోనూ మీ ఫోటోనే! ఆఖరికి ఎన్‌లార్జ్ అయిన ఆమె గుండెలో కూడా మీ ఫోటోనే డాడీ! మనింట్లో ఆమె గుర్తులు లేకుండా చేయగలిగారు. మీరు హార్ట్ సర్జన్ కదా! ఆమె గుండెకి ఆపరేషన్ చేసి లోపల దుఃఖం, బాధతో సహా దాచుకున్న మీ జ్ఞాపకాలు కూడా తీసేయలేకపోయారా? అప్పుడైతే ఆమె కొంచెం మనశ్శాంతితో ఉండగలదేమో! మమ్మీ! మీ కాస్మొటిక్ డెంటల్ సర్జరీ తెచ్చే వెలుగులు చిమ్మే నవ్వుకంటే బామ్మ నిర్మలమైన బోసి నవ్వే ఎక్కువ ఇష్టం నాకు. మమ్మీ! నాకు సున్నుండలు ఇష్టం! అరిసెలు ఇష్టం! బామ్మ ఇష్టం" దుఃఖం గొంతులో సుళ్ళు తిరుగుతుంటే ఇంక మాట్లాడలేక బామ్మ భుజంమీద తల ఆనించి ఏడుస్తూండిపోయింది నందిని.

మొదటిసారిగా కూతురి ముందు తల దించుకున్నారు సంధ్యా, మనోహర్. ★